# నూతన టెలికం విధానం2011 ఆమాద్మీ కోసమా? పెట్టుబడిదారుల కోసమా?

ఎం. తారానాథ్ Tue, 26 Apr 2011

**పెట్టుబడిదారులు, వారికి గులాములుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ పెద్దలూ, కలిసి కూర్చుని మాట్లాడుకుని రూపొందించే విధానం సామాన్య మానవునికి ఎలా అనుకూలంగా వుంటుంది? 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో ప్రస్తుత మంత్రిగారు ఎలాంటి లొసుగులూ లేవనీ, కేవలం వ్యవస్థాగత లోపాలు జరిగాయనీ చెప్పడం మనం గుర్తు చేసుకోవాలి. సేవా కార్యక్రమాలను, దేశ రక్షణకూ బాధ్యత వహించే బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ లాంటి పిఎస్యులను, ఉద్యోగ సంఘాలనూ విధాన రూపకల్పనలో భాగస్వాములను చేసి మెరుగైన, సామాన్యునికి అందుబాటులో ఉండే నూతన టెలికం విధానాన్ని రూపొందించే ప్రక్రియను చేపట్టాలి.**

## టెలికం విధానం అంటే ఏమిటి? దానికున్న ప్రాముఖ్యత ఏమిటి?

1839లో మొదటి టెలిగ్రాఫ్ లింకు కలకత్తా నుండి డైమండ్ హార్బర్‌కు 21 మైళ్ల దూరం వేశారు.

1851లో ఈస్టిండియా కంపెనీ అవసరాల కోసం ట్రాఫిక్ కోసం, టెలిగ్రాఫ్ లైను వేశారు.

1885లో ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్టు చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టం ప్రకారం టెలిగ్రాఫ్ లైన్లపై మొత్తం అధికారం కేంద్రానికి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత టెలికాం రంగంపై భారత ప్రభుత్వం పూర్తి అధీనంలోకి తీసుకుంటూ పోస్ట్ డ టెలిగ్రాఫ్ డిపార్టుమెంటును ఏర్పాటు చేశారు. ఆరవ పంచవర్ష ప్రణాళిక దాకా ప్రణాళికావేత్తల దృష్టిలో టెలికం రంగం లేదు. అప్పటిదాకా టెలికం రంగంపై పూర్తి ఆధిపత్యం భారత ప్రభుత్వానిదే. టెలిఫోను లాండ్ లైను కోసం కావాల్సినవారి వెయిటింగ్ లిస్టు ప్రకారం టెలిఫోను ఎక్స్ఛేంజిల ఏర్పాటు జరిగేది. టెలిఫోను రావాలంటే ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. టెలిఫోను సౌకర్యం ధనవంతులకు మాత్రమే అని పరిగణించబడేది.

టెలికం రంగంలో మొదటి సంస్కరణ 1984లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్(CDOT) ఏర్పాటుతో మొదలైందిగా భావించవచ్చు. 1948-50 మధ్యలో పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఆధ్వర్యంలోనే

"ఇండియన్ టెలిఫోన్ ఇండ్రస్టీస్ లిమిటెడ్" సంస్థ ఏర్పాటైంది. 1984లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ ఏర్పాటుతో వినియోగదారులు వినియోగించే టెలికం పరికరాలను తయారు చేయడానికి ప్రయివేటు రంగానికి అనుమతి లభించింది.

1986లో మెట్రో పట్టణాలైన ముంబయి, ఢిల్లీ నగరాల టెలికం అవసరాల కోసం ఎంటిఎన్ఎల్ ఏర్పాటైంది. 1986లోనే విదేశీ సంచార నిగం లిమిటెడ్ (విఎస్ఎన్ఎల్) ఏర్పాటైంది. (ప్రస్తుతం విఎస్ఎన్ఎల్ పోయి దాని స్థానంలో టాటా టెలికం వచ్చింది) 1989లో టెలికం రంగంలోని విధి విధానాల రూపకల్పన లక్ష్యంతో టెలికం కమిషన్ ఏర్పాటయింది. 1991లో టెలికం పరికరాల ఉత్పత్తులకు లైసెన్సులు మంజూరు చేయడం ప్రారంభమయింది.

24.7.1991న నూతన ఆర్థిక సంస్కరణల అమలుతో టెలికం రంగంలో పెనుమార్పులు ప్రారంభమయ్యాయి.

వాయిస్ మెయిల్, ఎలక్ట్రానిక్ మెయిల్, డాటా సర్వీసెస్, వీడియో కాన్ఫరెన్సింగ్ మొదలగు వాల్యూయాడెడ్ సర్వీసులలో ప్రయివేటు పెట్టుబడులకు అనుమతి జూలై 1992లో లభించింది.

ఇప్పటిదాకా టెలికాం రంగంపై ప్రభుత్వ పూర్తి అజమాయిషీ నడిచింది. గ్రామీణ ప్రాంతాలకు టెలికం సేవలు అందుబాటులోకి తేలేకపోయారు. దీంతో మొదటిసారిగా జాతీయ టెలికాం విధానం రూపుదిద్దుకుంది.

**జాతీయ టెలికాం విధానం 13.5.1994 :** అందుబాటు ధరలలో, ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో అడిగిన వెంటనే ఫోను ఇచ్చేలాగా చూడడం ప్రధాన లక్ష్యాలుగా జాతీయ టెలికాం విధానం ప్రకటించబడింది. దేశంలోని దాదాపు ఆరు లక్షల గ్రామాలకు టెలికం సౌకర్యం కల్పించే లక్ష్యం సాధించడానికి దాదాపు రూ. 11,750 కోట్లు అవసరమయ్యాయి. 8వ పంచవర్ష ప్రణాళిక నాటికి మరో రూ. 7,500 కోట్లు అదనంగా అవసరమయ్యాయి. దీనికోసం భారతీయ ప్రయివేటు టెలికం కంపెనీలకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ విధానం ప్రకారం 1994లో 8 సెల్యులర్ లైసెన్సులు, మెట్రో నగరాలలో 4 సెల్యులర్ లైసెన్సులు ఇచ్చారు. డిసెంబర్ 1995లో 18 రాష్ట్రాలలో 14 సెల్యులర్, 6 బేసిక్ లైసెన్సులు ఇచ్చారు.

**నూతన టెలికాం విధానం 1999:** జాతీయ టెలికాం విధానం 1994లో నిర్దేశించుకున్న లక్ష్యాలలో గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సర్వీసుల విస్తరణ, టెలికం కంపెనీల బలోపేతం అనుకున్నంతగా జరగలేదనీ కనుక మరో టెలికం విధాన రూపకల్పన అవసరమని భావించి ఎన్‌టిపి 1999 రూపొందించారు. 1994లో లైసెన్సులు పొందిన ప్రయివేటు టెలికం కంపెనీలు ఇన్ కమింగ్ కాల్స్‌కు కూడా చార్జీలు వసూలు చేసినా తమకు ఆదాయం తగినంతగా రాలేదని ప్రభుత్వం మీద ఒత్తిడి చేయడం అసలు కారణం. ఐ.టి, మీడియా, టెలికం రంగాలలో అత్యుత్తమ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం, గ్రామీణ ప్రాంత సర్వీసులను కూడా ప్రపంచ స్థాయి టెలికం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోనికి తేవడం, భారత టెలికం కంపెనీల ఆధునీకరణ, అన్నీ గ్రామాలకు టెలికం కవరేజి లక్ష్యాలుగా నూతన టెలికం విధానం 1999 ప్రకటించారు. "ఈక్వల్ లెవల్ ప్లేయింగ్ ఫీల్డు" అన్న విధానాన్ని తీసుకొచ్చారు. 2001-09 మధ్యలో దేశవ్యాప్తంగా 212 టెలికం సర్వీసు యాక్సెస్ లైసెన్సులు ఇచ్చారు.

## నూతన టెలికం విధానం 2011 రూపొందించాలని ప్రభుత్వం ఎందుకు భావిస్తోంది?

టెలికం సర్వీసు ప్రొవైడర్లకు లైసెన్సులు ఇవ్వడంలో 1994, 1999 విధానాలలోని లోపాల వల్ల అనేక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. 2003లో యుఏఎస్ఎల్ విధానం అమలులోకి వచ్చినా కొంతమంది బడా పెట్టుబడిదారులకు మేలు కలిగించడానికే ఈ విధానం అమలు చేశారని విమర్శలొచ్చాయి. స్పెక్ట్రమ్ కంపెనీలకు ఎలా ఇవ్వాలి. ఎంత ఇవ్వాలి అన్న విషయాలపై వివాదాలు ఏర్పడ్డాయి. ఇందుకోసం కొన్ని విధానాలు రూపొందించినా వాటిలోని లోపాల వల్ల మంత్రులు అధికారులు లక్షలాది కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారు. బ్రాడ్‌బాండ్ విధానం 2004లో ప్రకటించినా, 3జి, 4జి, వాల్యూ యాడెడ్ సర్వీసులు అందుబాటులోకి రావడంతో వీటి పైన సమగ్రమైన నూతన టెలికం విధానాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. 3జి స్పెక్ట్రమ్ వేలం ద్వారా లక్ష కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి రావడంతో దీని ద్వారా మరింత ఆదాయం ఆర్జించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

అంతరిక్ష, సమాచార, రక్షణ, ఇతర మంత్రిత్వ శాఖల వద్ద అందుబాటులో వున్న స్పెక్ట్రమ్‌ను ఖాళీ చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఈ స్పెక్ట్రమ్‌ను వేలం వేయడం ద్వారా మరింత ఆదాయాన్ని ఆర్జించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజా హయాంలో జరిగిన 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం తర్వాత కపిల్‌సిబాల్ కమ్యూనికేషన్ల మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక 1.1.2011న 100రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తామని ప్రకటించారు.

## 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ముఖ్యాంశాలు

1) స్పెక్ట్రమ్ ఎలా ఇవ్వాలి, లైసెన్సు విధానం ఎలా వుండాలి, టారిఫ్‌లు ఎలా వుండాలి, లైసెన్సులలోనే వెసులుబాటు ఎలా వుండాలి, స్పెక్ట్రమ్‌ని ఇతరులతో ఎలా పంచుకోవాలి, స్పెక్ట్రమ్‌ని ఏ ధరలకు ఇవ్వాలి. 2) గ్రీన్ టెలికం అమలు, టెలికం పరికరాల తయారీ వ్యవస్థ బలోపేతం. 3) బిఎస్ఎన్ఎల్/ ఎంటిఎన్ఎల్ అంతర్గత సామర్థ్యం పెరుగుదల, ఆర్థిక పరిస్థితి పటిష్టత. 4) టవర్ల నుండి వెలువడే రేడియేషన్ తగ్గింపునకు చర్యలు. 5) టెలికం పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ప్రత్యేక చర్యలు. 6) దేశంలోని 6 లక్షల గ్రామాలను వైర్‌లెస్ బ్రాడ్ బ్యాండ్ ద్వారా కలిపి గ్రామీణ ప్రాంతాల సౌకర్యాల కల్పనకు యూనివర్సల్ సర్వీసు ఆబ్లిగేషన్ ఫండ్ ద్వారా తగిన పరిహారం అందించడం. మొదలైన అంశాలపై నూతన టెలికం విధానం 2011ను రూపొందించాలనీ ఈ ప్రక్రియ 100 రోజులలో పూర్తి కావాలనీ మంత్రి సంకల్పించారు.

## ఎన్‌టిపి 2011 రూపకల్పనలో ఎవరిని భాగస్వాములను చేశారు?

సమగ్ర నూతన టెలికం విధానం 2011 ప్రకటించడానికి అడిషనల్ సెక్రటరీ (టెలికం) అధ్యక్షులుగా, అడ్వైజర్ (టెలికం) కో ఛైర్మన్‌గా, టెలికం కమిషన్‌లోని అందరూ డిడిజిలు  మెంబర్లుగా ఒక కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. 8.12.10న నేషనల్ బ్రాడ్ బ్యాండ్ ప్లాను ప్రకటించిన టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సిఫార్సుల ఆధారంగా 19.1.2011న సెల్యులర్ ఆపరేటర్లతో మొదటి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సు జరిగింది.

8.2.11న ట్రాయ్ స్పెక్ట్రమ్ లైసెన్సింగ్‌పై ఇచ్చిన సిఫారసులపై 8.3.11న టెలికం సర్వీసు ప్రొవైడర్లతో కమ్యూనికేషన్ల మంత్రి కపిల్ సిబాల్ రెండవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేషనల్

ఫ్రీక్వెన్సీ కేటాయింపు ప్రణాళిక 2011 (ఎన్ఎఫ్ఎపి) ద్వారా సిఫారసులపై చర్చలు జరుగుతాయి. లైసెన్సులు మంజూరు చేసే సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు సూచించమని 24.3.2011న కేంద్ర హోంశాఖకు లేఖ రాశారు.

నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ (ఎన్ఓఎఫ్ఎన్) ద్వారా గ్రామీణ ప్రాంత సర్వీసుల మెరుగుదలపై 30.3.2011న శ్యాం పెట్రోడా పెట్టుబడిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఎన్టిపి 2011 రూపకల్పన అమాద్మి కోసమా? అయితే ఆమాద్మీ కి ఏం కావాలో బడాపెట్టుబడి దారులు చెబుతారని మంత్రి భావిస్తున్నారా?

అడిగిన వెంటనే ఫోను పొందుతున్నప్పుడు, ఆధునిక టెలికం సాంకేతికత సామాన్య మానవునికి అందుబాటులోకి, అనువైన ధరలలోకి వచ్చినప్పుడు టెలికం విధానపు లక్ష్యం నెరవేరిందని కొంతమంది భావించవచ్చు.

టెలికం విధానాల రూపకల్పన ప్రక్రియలో బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, ఐటిఐ, హెచ్సిఎల్ లాంటి ప్రభుత్వ సర్వీసు ప్రొవైడర్లకు అవకాశం కల్పించబడలేదు. "ఈక్వల్ లెవల్ ప్లేయింగు ఫీల్డు" పేరుతో ఎన్టిపి 99 నాటి సూత్రాలకు విరుద్ధంగా బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ వద్ద లైసెన్సు ఫీజు వసూలు చేసిన ప్రభుత్వం విధాన రూపకల్పనలో ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వాములను చేయకపోవడం ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఎంతగా లొంగిపోయిందో తెలియజేస్తోంది.

గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 90శాతం సేవలను బిఎస్ఎన్ఎల్ మాత్రమే అందిస్తోంది. లైసెన్సు నిబంధనలను తుంగలో తొక్కి గ్రామీణ ప్రాంత సేవలను ప్రయివేటు టెలికం కంపెనీలు అందించకపోయినా వాటిపై విధించిన పెనాల్టీ వేల కోట్లను రద్దు చేసిన ప్రభుత్వాలు, బిఎస్ఎన్ఎల్ అందించే గ్రామీణ ప్రాంత సేవలకు ఎలాంటి పరిహారం అందించడం లేదు.

ఉద్యోగులు గతంలో సమ్మె చేసినప్పుడు భవిష్యత్తులో టెలికం విధానం రూపకల్పనలో ఉద్యోగ సంఘాలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీకి విరుద్ధంగా పెట్టుబడిదారులతో రెండు సమావేశాలు నిర్వహించిన ప్రభుత్వం, మరో రెండు సమావేశాలు

నిర్వహిస్తామనీ, పెట్టుబడి దారులు ఏకాభిప్రాయానికి వస్తే, విధాన రూపకల్పన వెంటనే జరుగుతుందనీ ప్రకటించడం విడ్డూరం.

టవర్ల కంపెనీలకు లైసెన్సులు ఇవ్వాలనీ, లైసెన్సు కాలపరిమితిని 20 సంవత్సరాలకు బదులుగా 10 సంవత్సరాలకు తగ్గించాలనీ, లైసెన్సు మంజూరు సమయంలో స్పెక్ట్రమ్ అలాట్‌మెంట్ ఇవ్వడం ఆపాలనీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రతిపాదనల ద్వారా మరింత ఆదాయం సంపాదించాలని ప్రభుత్వ ప్రయత్నం. సహజంగానే ఈ ప్రతిపాదనల్ని పెట్టుబడిదారులు వ్యతిరేకించారు. 8.3.11 నాటి సమావేశంలో కమ్యూనికేషన్ల మంత్రి కపిల్‌సిబాల్ పెట్టుబడిదారులందరూ కలిసి మాట్లాడుకుని ఏకాభిప్రాయానికి రావాలని అనేకమార్లు బ్రతిమాలారు.

పెట్టుబడిదారులు, వారికి గులాములుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ పెద్దలూ, కలిసి కూర్చుని మాట్లాడుకుని రూపొందించే విధానం సామాన్య మానవునికి ఎలా అనుకూలంగా వుంటుంది? 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో ప్రస్తుత మంత్రిగారు ఎలాంటి లొసుగులూ లేవనీ, కేవలం వ్యవస్థాగత లోపాలు జరిగాయనీ చెప్పడం మనం గుర్తు చేసుకోవాలి. సేవా కార్యక్రమాలను, దేశ రక్షణకూ బాధ్యత వహించే బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ లాంటి పిఎస్‌యులను, ఉద్యోగ సంఘాలనూ విధాన రూపకల్పనలో భాగస్వాములను చేసి మెరుగైన, సామాన్యునికి అందుబాటులో ఉండే నూతన టెలికం విధానాన్ని రూపొందించే ప్రక్రియను చేపట్టాలి.

**ఎం. తారానాథ్**

(రచయిత బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎ.పి సర్కిల్ సహాయ కార్యదర్శి)